మారం పవిత్ర బోధన ఆదర్శనీయం

- జాతీయ ఉత్తమ ఉపాధ్యాయురాలిని అభినందిస్తూ సిఎం రేవంత్‌రెడ్డి ట్వీట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సాంకేతికత, వినూత్న పద్ధతులతో బోధనలో తనదైన శైలిని రూపొందించుకుని ముందుకు సాగుతున్న, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ఎంపికైన మారం పవిత్రకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభినందనలు తెలిపారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయురాలు అవార్డుకు ఎంపికైన సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు మారం పవిత్రను అభినందిస్తూ సిఎం ట్వీట్ చేశారు.

4,454 మంది టీచర్లకు ఉద్యోగోన్నతులు

- 15 రోజుల్లో జాయిన్ కావాలి
- డాక్టర్ నవీన్ నికోలస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో 4,454 మంది టీచర్లకు ఉద్యోగోన్నతి కల్పించినట్టు పాఠశాల విద్య సంచాలకులు డాక్టర్ ఇ నవీన్ నికోలస్ తెలిపారు. ఉద్యోగోన్నతుల ఆర్డర్స్ అందుకున్న వారు 15 రోజుల్లో కొత్త పోస్టులో చేరాలని ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు నిర్దేశించుకున్న సమయంలోపు ఉద్యోగోన్నతులు పూర్తి చేసినట్టు తెలిపారు. మొత్తం 880 మంది స్కూల్ అసిస్టెంట్లు హెడ్ మాస్టర్ గ్రేడ్ -2 (గెజిటెడ్)గా ఉద్యోగోన్నతి పొందగా, 3,574 మంది సెకెండరీ గ్రేడ్ టీచర్లు స్కూల్ అసిస్టెంట్లుగా, దానికి సమానమైన కేడర్లకు పదోన్నతి పొందారు. హెడ్ మాస్టర్ గ్రేడ్ -2 (గెజిటెడ్) ఉద్యోగోన్నతి పొందిన వారిలో మల్టీ జోన్ - 1 నుంచి 490 మంది ఉండగా, మల్టీ జోన్-2 నుంచి 390 మంది ఉన్నారు. కాగా స్కూల్ అసిస్టెంట్లుగా 2,763 మంది ఉద్యోగోన్నతి పొందగా, 811 మంది ప్రైమరీ స్కూల్ హెడ్ మాస్టర్ (పిఎస్ హెచ్‌ఎం, ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం)గా ప్రమోషన్ పొందారు. భవిష్యత్తులోనూ బదిలీలు, ఉద్యోగోన్నతులు ఖాళీలు, అర్హులైన అభ్యర్థుల అందుబాటు మేరకు క్రమపద్ధతిలో నిర్వహించనున్నట్టు ఆయన వెల్లడించారు.

స్థానిక సమరంపై కసరత్తు

- తుది ఓటర్ల జాబితా నోటిఫికేషన్ విడుదల చేసిన ఎన్నికల సంఘం
- రేపటిలోగా పంచాయతీల్లో ముసాయిదా ఓటర్ల జాబితా
- తుది ఓటర్ల జాబితా సెప్టెంబర్ 2న విడుదల
- 29, 30 తేదీల్లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు
- 30న అభ్యంతరాలు స్వీకరణ... 31న తుది జాబితా ప్రచురణ
- 42 శాతం బిసి రిజర్వేషన్లపై న్యాయకోవిదులతో రాష్ట్ర సర్కారు సమాలోచనలు
- 30 నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాలూ దాని చుట్టూనే

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బిసి రిజర్వేషన్ల అమలు సాధ్యాసాధ్యాలపై ఓవైపు రాష్ట్ర సర్కారు న్యాయకోవిదులతో సమాలోచనలు జరుపుతుండగా.. మరోవైపు హైకోర్టు విధించిన సెప్టెంబర్ 30 గడువు ముంచుకొస్తున్న నేపథ్యంలో మరోవైపు రాష్ట్ర ఎన్నికల సంఘం కూడా కసరత్తు ముమ్మరం చేసింది. పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, తుది ఓటర్ల జాబితా నోటిఫికేషన్‌ను రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని మంగళవారం విడుదల చేశారు. నోటిఫికేషన్‌కు అనుగుణంగా నడుచుకోవాలని హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరిలకు మినహా అన్ని జిల్లాల అధికారులకు ఆమె ఆదేశాలు జారీ చేశారు. అన్ని పంచాయతీల్లోనూ, మండల పరిషత్ కార్యాలయాల్లోనూ గ్రామపంచాయతీ, వార్డుల వారీగా ఫొటో ఓటర్ల జాబితాను తయారు చేసి ఈ నెల 28లోగా ప్రదర్శించాలని పంచాయతీ అధికారులను రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. ఈ నెల 29న రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా స్థాయి ఎన్నికల అధికారులు సంయుక్త సమావేశాన్ని, 30వ తేదీన రాజకీయ పార్టీల ప్రతినిధులతో మండలస్థాయి సమావేశాన్ని ఎంపిడిఒలు నిర్వహించనున్నారు. ముసాయిదా ఓటర్ల జాబితాపై అభ్యంతరాలను 28 నుంచి 30 వతేదీ వరకు ఎన్నికల అధికారులు స్వీకరించనున్నారు. ఈ నెల 31 వరకు అభ్యంతరాలను డిపిఒ పరిశీలించనున్నారు. ఆ తర్వాత సెప్టెంబర్ రెండో తేదీన గ్రామపంచాయతీ, వార్డుల వారీగా తుది ఓటర్ల జాబితాను ఆయా జిల్లాల పంచాయతీ అధికారులు విడుదల చేయనున్నారు.

ముంచుకొస్తున్న గడువు...'బిసి'ల చుట్టూ హడావిడి

రాష్ట్రంలో గ్రామపంచాయతీ పాలకమండళ్ల పదవీకాలం గతేడాది జనవరి 31తో ముగిసింది. గడువు ముగిసి ఏడాదిన్నర దాటినా ఎన్నికలు నిర్వహించట్లేదని పలువురు హైకోర్టును ఆశ్రయించగా..స్థానిక ఎన్నికలను సెప్టెంబర్ 30 లోగా నిర్వహించాలని హైకోర్టు రాష్ట్ర సర్కారును ఆదేశించిన విషయం విదితమే. మరోవైపు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బిసి రిజర్వేషన్లకు సంబంధించిన బిల్లును అసెంబ్లీ ఆమోదం పొందింది. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ఆ బిల్లును పంపింది. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి నేతృత్వంలోని ఎన్డీయే సర్కారు ఎటూ తేల్చకుండా దాన్ని పక్కనపడేసింది. స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లకు ఆమోదం తెలపాలంటూ గవర్నర్‌కు రాష్ట్ర సర్కారు ప్రతిపాదించగా.. న్యాయసలహా పేరుతో కేంద్ర న్యాయ శాఖకు పంపించారు. ఇప్పటి వరకూ దానిపై ఎటూ తేల్చలేదు. ఆ బిల్లును అమోదించాలంటూ అధికార కాంగ్రెస్ పార్టీతో పాటు ఇండియా బ్లాక్‌లోని భాగస్వామ్య పక్షాలు దేశ రాజధాని న్యూఢిల్లీ వేదికగా ఆందోళనలు చేపట్టిన విషయం విదితమే. అయినా, కేంద్ర ప్రభుత్వంలో చలనం లేదు. మరోవైపు బిసి రిజర్వేషన్ కోటాలో పదిశాతం మంది ముస్లింలకు చేర్చారని ఆరోపిస్తూ బిజెపి రాజకీయ లబ్ధి పొందే ప్రయత్నం చేస్తున్నది. రిజర్వేషన్ల కోటా పరిమితి మించడం సుప్రీం కోర్టు తీర్పులకు విరుద్ధమనే వాదనను ఆ పార్టీ తెరపైకి తీసుకొచ్చింది. బిజెపి వాదన సహేతుకం కాదంటూ బిసి సంఘాలు, ఇతర రాజకీయ పార్టీలు వాదిస్తున్నాయి. దేశ జనాభాలో రెండు, మూడు శాతానికి మించి లేని అగ్రవర్ణ పేదలకు పది శాతం రిజర్వేషన్లను కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చినప్పుడు లేని అభ్యంతరం ఇప్పుడు బిజెపి నేతలకు ఎందుకని ఆయా పార్టీలు బాహాటంగానే ప్రశ్నిస్తున్నాయి. దీనిపై రాజకీయ రచ్చ నడుస్తుండగా..మరోవైపు హైకోర్టు ఇచ్చిన గడువు ముంచుకొస్తున్నది. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర సర్కారు న్యాయనిపుణులతో సంప్రదింపులు చేస్తున్నది. ఒకవేళ అమలు సాధ్యం కాని పక్షంలో బిసి రిజర్వేషన్లను బిజెపి అడ్డుకుంటున్నదని చెబుతూ.. జిల్లా/మండలాల వారీగా బిసి అభ్యర్థులకు 42 శాతం సీట్లను కేటాయించే ఆలోచనలో కాంగ్రెస్ నాయకత్వం ఉన్నట్టు ప్రచారం జరుగుతున్నది. ఈ నెల 30 నుంచి మూడు రోజుల పాటు జరిగే అసెంబ్లీ సమావేశాల్లో కాళేశ్వర ప్రాజెక్టు నివేదికపైనా, స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుపైనే ప్రధాన చర్చ జరిగే అవకాశముంది.

రాష్ట్ర ప్రజలకు గవర్నర్, సిఎం వినాయక చవితి శుభాకాంక్షలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రజలకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరి జీవితంలోని విఘ్నాలను తొలగించి అందరికీ ఆనందం, ఐశ్వర్యం, ఆరోగ్యం ప్రసాదించాలని ప్రార్థించారు. గణపతి నవరాత్రుల సందర్భంగా హైదరాబాద్ సహా అన్ని జిల్లా కేంద్రాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలనీ, భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే మండపాల వద్ద తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పోలీస్ అధికారులను సిఎం ఆదేశించారు. ఈ సంవత్సరం కూడా వినాయకుని మండపాలకు ప్రభుత్వం ఉచితంగా విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నదని చెప్పారు. అలాగే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, కేంద్ర మంత్రులు జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సీతక్క, కొండా సురేఖ, జూపల్లి కృష్ణారావు, టిపిసిసి అధ్యక్షులు మహేశ్‌కుమార్ గౌడ్, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచంద్రరావు రాష్ట్ర ప్రజలకు తమ హార్దిక శుభాకాంక్షలు తెలిపారు.

యూరియాపై బిజెపిది తప్పుడు ప్రచారం

- తెలంగాణ వాటాను కేంద్రం వెంటనే విడుదల చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వానాకాలం సీజన్ ప్రారంభమై రెండు నెలలు దాటినా కావాల్సిన యూరియాను అందించడంలో కేంద్రప్రభుత్వం విఫలమైందని, పైగా ఈ విషయంలో బిజెపి తప్పుడు ప్రచారం చేస్తున్నదని సిపిఎం రాష్ట్ర కమిటీ విమర్శించింది. తెలంగాణ వాటాను కేంద్రం వెంటనే విడుదల చేయాలని, ఈ విషయంలో కేంద్ర మంత్రులు, బిజెపి ఎంపిలు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ఒక ప్రకటన విడుదల చేశారు. యూరియా కోసం రైతులు నెల రోజులుగా రోడ్లపైకి వస్తున్నప్పటికీ బిజెపి నాయకులు కుంటి సాకులు చెబుతూ "కృత్రిమ కొరత" సృష్టించారనే తప్పుడు ప్రచారం చేయడాన్ని తప్పుబట్టారు. రాష్ట్రానికి 9.8 లక్షల టన్నులు యూరియా కావాల్సి ఉంగా 1.5 లక్షల టన్నులను తగ్గించిందని గుర్తుచేశారు. కేటాయించిన కోటాను కూడా ఇంత వరకు సకాలంలో సరఫరా చేయకుండా కేంద్రం జాప్యం చేస్తున్నదనీ, దాంతో రాష్ట్రంలో యూరియా కొరత ఏర్పడిందని తెలిపారు. రైతులంతా సహకార సంఘాలు, షాపుల ముందు పడిగాపులు కాస్తుంటే...ఆందోళనలు చేస్తుంటే బిజెపి నేతలు తమ తప్పిదాన్ని కప్పిపుచ్చుకోవాలని చూడటం దారుణమని విమర్శించారు. రాష్ట్రంలోని రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ నుంచైనా రాష్ట్ర అవసరాలకు యూరియాను సరఫరా చేయాలని కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం అనేకసార్లు కోరినా ఉద్దేశ్యపూర్వకంగానే కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఎత్తిచూపారు. దీంతో 45 కేజీల యూరియా బస్తా రూ.242 కాగా, ప్రస్తుతం బ్లాక్ మార్కెట్‌లో రు.350కి అమ్ముతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా కేంద్ర బిజెపి ప్రభుత్వం యూరియా కొరతను తీర్చడానికి, బ్లాక్ మార్కెట్‌ను నిరోధించడానికి చర్యలు తీసుకోవాలనీ, రాష్ట్ర ప్రభుత్వం హాకా, సహకార సంఘాల ద్వారా సరిపడా ఎరువులను సరఫరా చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి అవసరమైన యూరియాను కేంద్ర ప్రభుత్వం నుంచి తెప్పించడానికి అన్ని రకాల చర్యలు తీసుకోవాలనీ, రైతులను ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

తాలి పేరు ప్రాజెక్టుకు భారీ వరద పోటు

7 గేట్లు పూర్తిగా ఎత్తి 58,695 క్యూసెక్కుల నీరు విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలోని తాలిపేరు మధ్యతరహా ప్రాజెక్టుకు వరద నీరు భారీగా చేరుకుంది. సరిహద్దు ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో కురుస్తున్న భారీ వర్షాలకు మంగళవారం రాత్రి 7:30 సమయం వరకు భారీగా వరద నీరు రావడంతో ముందస్తు జాగ్రత్త కోసం అధికారులు 24 గేట్లకు గాను 7 గేట్లు పూర్తిగా ఎత్తి 58,695 క్యూసెక్కుల వరద నీటిని దిగువన ఉన్న గోదావరిలోకి విడుదల చేశారు. ప్రాజెక్టు సరాసరి నీటిమట్టం 74 మీటర్లు కాగా ప్రస్తుతం 73.52 మీటర్లు నీటి నిలువ ఉంచి అధికంగా వస్తున్న 34 వేల క్యూసెక్కుల నీటిని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ దిగువకు విడుదల చేస్తున్నారు. కాగా, తాలిపేరు ప్రాజెక్టు తీరంలో ఉన్న దోస్తులపల్లి, అంజనాపురం, కేశవపురం, దండుపేట కాలనీ గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

ప్రభుత్వ మోడల్ స్కూల్స్‌లో 48,630 సీట్లు ఖాళీ

- స్పాట్ అడ్మిషన్లకు ఆహ్వానం : నవీన్ నికోలస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ మోడల్ స్కూల్స్‌లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్టు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ డాక్టర్ ఇ.నవీన్ నికోలస్ తెలిపారు. ఇటీవల 2025-26 విద్యా సంవత్సరానికి మోడల్ స్కూల్స్‌లో ఆరు నుంచి పదో తరగతి వరకు అడ్మిషన్ల కోసం ప్రవేశ పరీక్షను నిర్వహించిన సంగతి తెలిసిందే. అడ్మిషన్ల ప్రక్రియ పూర్తయిన తర్వాత కూడా 48,630 సీట్లు ఇంకా ఖాళీగా ఉన్నాయి. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ మోడల్ స్కూల్స్‌లో ఆ సీట్లను స్పాట్ అడ్మిషన్ల ద్వారా భర్తీ చేయనున్నారు. అత్యధికంగా ఇంటర్ సెకండ్ ఇయర్‌లో 13,256 సీట్లు, ఇంటర్ మొదటి సంవత్సరంలో 12,668 సీట్లు అందుబాటులో ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఆరో తరగతికి సంబంధించి 7,543 సీట్లు, ఏడో తరగతిలో 5,192 సీట్లు, 8వ తరగతి 3,936 సీట్లు, 9వ తరగతి 2,884 సీట్లు, పదో తరగతిలో 3,151 సీట్లను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. మోడల్ స్కూల్స్‌లో సీట్లు కావాలనుకునే వారు నేరుగా పాఠశాలకు వెళ్లి ప్రిన్సిపల్‌ను కలవాలని సూచించారు.

హైకోర్టు తీర్పుతో సాదా బైనామాలకు శాశ్వత హక్కులు

- తెలంగాణ డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు లచ్చిరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



హైకోర్టు తీర్పుతో సాదాబైనామాలకు శాశ్వత హక్కులు లభిస్తాయని తెలంగాణ డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వి.లచ్చిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ తెలిపారు. రాష్ట్రంలో సుమారు 9,00,894 మంది రైతులకు మేలు జరగడంతో పాటు పది లక్షల ఎకరాల భూములకు 13-బి ప్రొసీడింగ్స్ జారీ అవుతాయని పేర్కొన్నారు. ఈ ప్రక్రియ సంపూర్ణమయితే రాష్ట్రంలో చాలా వరకు భూ వివాదాలు తగ్గుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. 2014 జూన్ రెండు కంటే ముందు తెల్లకాగితం ద్వారా కొనుగోలు చేసిన భూములను క్రమబద్ధీకరణలో భాగంగా అర్హులైన రైతుల నుంచి గత సర్కార్ స్వీకరించింది. మొదటి విడతలో 12,64,000 మంది రైతులు మీ సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. తెలంగాణ భూమి హక్కులు, పట్టాదారు పాసుపుస్తకం చట్టం-1971 ప్రకారం అర్హులైన రైతులకు 13-బి ప్రొసీడింగ్‌లను జారీ చేయడంతో పాటు ఆరు లక్షల మందికి పట్టాదారు పాసుపుస్తకాలను అందించారు. తదనంతరం రైతుల నుంచి వచ్చిన వినతుల మేరకు సాదాబైనామాలకు మరో రెండు సార్లు దరఖాస్తులను స్వీకరించారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడ్డ ప్రభుత్వం రికార్డు ఆఫ్ రైట్-2025 (ఆర్‌ఓఆర్) నూతన చట్టాన్ని అమల్లోకి. తీసుకువచ్చింది. నూతన చట్టం అమల్లోకి వచ్చిన తరువాత రద్దయిన ఆర్‌ఓఆర్ చట్టం ప్రకారం సాదాబైనామాల దరఖాస్తు లను ఎలా స్వీకరిస్తారని, ప్రభుత్వ ఉత్తర్వులను రద్దు చేయాలని ఓ వ్యక్తి హైకోర్టులో ఫిల్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేసిన హైకోర్టు 2020 అక్టోబర్ 29 తరువాత వచ్చిన దరఖాస్తులపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ అక్టోబర్ 29వ తేదీలోపు స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి 13-బి పత్రాలను జారీ చేయవచ్చని మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. కానీ అవి అమలుకు నోచుకోలేదు. తాజాగా 2020 అక్టోబర్ 30 లోపు స్వీకరించిన 2,26,693 దరఖాస్తులను, అక్టోబర్ 30వ తేదీ నుంచి నవంబర్ 10 వరకు స్వీకరించిన దరఖాస్తులను తెలంగాణ రికార్డు ఆఫ్ రైట్ ప్రకారం సాదాబైనామాలను క్రమబద్ధీకరించవచ్చని హైకోర్టు తీర్పు వెల్లడించింది.

మేకలు, గొర్రెల దొంగలు 16మంది అరెస్ట్

- 26 నేరాల్లో 200కు పైగా మేకలు దొంగిలించిన ముఠా సభ్యులు
- 2.46 లక్షల నగదు, 22 గొర్రెలు, 8 కార్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన నల్లగొండ ఎస్పి శరత్‌చంద్రపవార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రామాల్లో పగలు రెక్కీ నిర్వహించి.. రాత్రి సమయాల్లో కార్లలో వచ్చి మేకలు, గొర్రెల దొంగతనాలకు పాల్పడుతున్న నాలుగు అంతర్ జిల్లా దొంగల ముఠాలను అరెస్టు చేసినట్టు నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్రపవార్ తెలిపారు. నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. శాలిగౌరారం పోలీసులు సోమవారం బైరవోనిబండ ఎక్స్ రోడ్ వద్ద వాహన తనిఖీ చేపడుతున్న సమయంలో.. దొంగలు షిఫ్ట్ డిజైర్ కారులో తప్పించుకుపోవడానికి ప్రయత్నించారు. పోలీసులు కారును వెంబడించి పట్టుకున్నారు. కారులో ముగ్గురు పురుషులు, మహిళ ఉన్నారు. వారిని పోలీసుల వద్ద ఉన్న ఫింగర్ ప్రింట్ స్కానర్‌తో చెక్ చేయగా.. వారిపై గతంలో మేకల దొంగతనం కేసులు ఉన్నట్టు తేలింది. వెంటనే అదుపులోకి తీసుకొని విచారించారు. సంపంగి వెంకటేష్, వెంరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, సంపంగి శారద, దాసర్ల వినోద్ కుమార్, ఏ.కోటిపైన గతంలో నల్లగొండ రూరల్ పిఎస్, నల్లగొండ-2 టౌన్, కనగల్, చండూర్, విజయపురి, నార్కట్‌పల్లి, మర్రిగూడ, దేవరకొండ, శాలిగౌరారం, నాంపల్లి, మునుగోడు, చింతపల్లి పిఎస్‌లలో మేకల దొంగతనాల కేసులు ఉన్నాయి. వీరు గతంలో జైలుకు వెళ్లొచ్చారు. వారికి పరిచయం ఉన్న వారందరూ కలిసి నాలుగు గ్రూపులుగా ఏర్పడి ఖరీదైన కార్లలో వచ్చి పగటి పూట రెక్కీ నిర్వహించి.. రాత్రి సమయాల్లో మేకలను కార్లలో వేసుకొని పోతున్నారు. నల్లగొండ జిల్లాలో మొత్తం 15 చోట్ల, రాచకొండ, సైబరాబాద్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాల పరిధిలో 10 చోట్ల మేకలు, గొర్రెల దొంగతనాలు చేశారు. మొత్తం 16మందిని అరెస్టు చేశారు. 26 నేరాలకు సంబంధించి 200కుపైగా మేకలను దొంగతనం చేశారు. రూ.2లక్షల 46వేలు, 2 లక్షల 75వేల విలువ గల 22 గొర్రెలు, 47 లక్షల విలువ గల 8 కార్లు స్వాధీనం చేసుకున్నారు.

ప్రశంసా పత్రాలు, రివార్డులు

నల్లగొండ డిఎస్‌పి కె శివరాంరెడ్డి పర్యవేక్షణలో దొంగలను పట్టుకోవడంలో ప్రతిభ కనపరిచిన నల్లగొండ సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ ఎం.జితేందర్‌రెడ్డి, ఎం.నాగభూషణ్, శాలిగౌరారం ఇన్‌స్పెక్టర్ కె.కొండల్‌రెడ్డి, నార్కట్‌పల్లి సీఐ కె.నాగరాజు, ఎస్‌ఐలు శివకుమార్, విజయ్ కుమార్, రవి, రవి కుమార్, సీసీఎస్ హెడ్ కానిస్టేబుల్ విష్ణువర్ధనగిరి, వహీద్ పాషా, సూఫీయాన్ అలీ, రామ్ ప్రసాద్, నాగరాజు, సిసిఎస్ కానిస్టేబుల్ అశ్రార్, మహేశ్, వెంకట్ రామ్, సాయిని ఎస్పీ అభినందించారు. వారికి ప్రశంసాపత్రాలు అందజేసి రివార్డు ప్రకటించారు.

సాదాబైనామాల పరిష్కారానికి దారి చూపిన భూభారతి

- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సాదాబైనామాలను అనుమతించాలని హైకోర్టు వెలువరించిన తీర్పు మేరకు భూభారతి చట్టం ద్వారా వాటికి పరిష్కారం చూపిస్తామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. హైకోర్టు మంగళవారం ఇచ్చిన తీర్పు లక్షలాది మంది పేద ప్రజల కలలను సాకారం చేస్తోందన్నారు. సాదా బైనామాల విషయంలో బిఆర్‌ఎస్ ప్రభుత్వం పేద ప్రజలను నమ్మించి మోసం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్‌వోఆర్ 2020 ఆర్‌ఓఆర్ చట్టం పరిష్కారం చూపించలేదని విమర్శించారు. ఫలితంగా 9.26 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. వాటి పరిష్కారం కోసం తమ ప్రభుత్వం కోర్టు కేసును నిరంతరం పర్యవేక్షించిందని గుర్తు ఈ క్రమంలో సాదాబైనామాల దరఖాస్తులను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామని మంత్రి తెలిపారు.

రవి నాయక్ మరణంపై విచారణకు మంత్రి ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహబూబ్‌నగర్ జిల్లా ఈర్లపల్లి తండాకు చెందిన రవి నాయక్ మరణానికి సకాలంలో చికిత్స అందకపోవడమే కారణం అని పత్రికల్లో వచ్చిన వార్తలపై మంగళవారం వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ విచారణకు ఆదేశించారు. ఉన్నతాధికారులతో కమిటీ ఏర్పాటు చేసి, విచారణ జరిపించాలని మంత్రి సూచించారు. నిజమేంటో తేల్చి, ఎవరిదైనా నిర్లక్ష్యం ఉంటే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. మంత్రి ఆదేశాల మేరకు మెడికల్ ఎడ్యుకేషన్ అడిషనల్ డైరెక్టర్లు డాక్టర్ రాజారావు, డాక్టర్ నాగేందర్‌లతో కమిటీ ఏర్పాటు చేస్తూ మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ నరేంద్ర కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో వ్యవహరించినట్టు, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా మంత్రి హెచ్చరించారు.

ఉత్సవాల వేళ అప్రమత్తత అవసరం

- ప్రమాదాలు జరగకుండా భద్రతా చర్యలు పాటించాలి
- అత్యవసర పరిస్థితుల్లో 1912 నెంబర్‌కు కాల్ చేయండి
- గణేష్ మండపాలకు ఉచిత విద్యుత్ : అధికారులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆనందంగా జరుపుకునే వినాయక పండుగ వేళ కాస్త అప్రమత్తంగా ఉండాలని టిజి ఎస్‌పిడిసిఎల్ అధికారులు సూచిస్తున్నారు. ప్రధానంగా విద్యుత్ నిర్వహణలో జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. భారీ విగ్రహాల తరలింపులో విద్యుత్ అధికారుల సహకారం కోరాలని, సమాచారమిస్తే విగ్రహం వెంట సిబ్బందిని పంపుతామని తెలిపారు. అనుమతి పొందిన మండపాల నిర్వాహకులకు ఉచితంగానే విద్యుత్ అందిస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు. ఈ నెల 27 నుంచి సెప్టెంబర్ 6వ తేదీ వరకు 11 రోజులపాటు తాత్కాలిక సరఫరా కేటగిరీలో గణేశ్ మండపాలకు ఉచిత విద్యుత్ అందించనున్నారు. అయితే, భద్రతా చర్యలు చేపట్టకపోతే ప్రమాదాలకు ఆస్కారం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు.

విగ్రహాల తరలింపులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

1. విగ్రహాల ఎత్తుని బట్టి రూట్‌ని నిర్ణయించుకోవాలి. ఒక వేళ ఎక్కడైనా సమస్యలుంటే విద్యుత్ సిబ్బందికి తెలియజేయాలి. 2. విద్యుత్ లైన్ల నుంచి కనీసం రెండు అడుగుల దూరం పాటించాలి. లైన్‌లో ప్రవహించే విద్యుత్ సరఫరా ప్రభావం / ఇండక్షన్ ఉంటుంది. 3. క్రేన్‌లు, ట్రక్స్, ఎత్తైన మెటల్ విగ్రహాల తరలింపులో మరింత అప్రమత్తంగా ఉండాలి. 4. మెటల్ ఫ్రేమ్‌లతో కూడిన డెకొరేషన్‌లను వీలైనంత మేరకు తగ్గించాలి.

మండపాల వద్ద..

1. మండపాలకు విద్యుత్ సరఫరా కనెక్షన్ కోసం సామాన్యులు స్తంభాలు ఎక్కరాదు. సంస్థ సిబ్బంది ద్వారానే విద్యుత్ కనెక్షన్ పొందాలి. 2. ఐఎస్ఐ మార్క్ కలిగిన ప్రామాణిక విద్యుత్ వైర్లను మాత్రమే వాడాలి. ఎలాంటి జాయింట్ వైర్లు వాడరాదు. తగినంత కెపాసిటీ కలిగిన ఎంసిబి తప్పనిసరిగా వాడాలి. ఇది విద్యుత్ ప్రమాదాల నుంచి రక్షణ ఇస్తుంది. 3. మండపాల్లో విద్యుత్ సంబంధిత పనులు చేసేటప్పుడు పరిసరాలను పరిశీలించాలి. విద్యుత్ వైర్లు/ పోల్స్, ఇతర ప్రమాదకర విద్యుత్ పరికరాల నుంచి పిల్లల్ని దూరంగా ఉంచాలి. 4. ఒక వేళ ఎవరికైనా విద్యుత్ షాక్ తగిలితే వెంటనే వైద్య సహాయం అందించి, ఆ ప్రమాదం గురించి దగ్గరలోని విద్యుత్ సిబ్బందికి తెలియజేయగలరు. 5. విద్యుత్ వైరింగ్‌లో ఎక్కడైనా లీకేజ్ ఉంటే, వర్షాలు కురిసినప్పుడు తేమ వల్ల షాక్ కలిగే అవకాశమున్నది. కనుక మండప నిర్వాహకులు ప్రతి రోజూ తప్పనిసరిగా వైరింగ్‌ను పరిశీలించాలి. 6. విద్యుత్ లైన్స్ ఎక్కడైనా తెగి పడ్డా, ఇతర అత్యవసర పరిస్థితులు ఏర్పడినప్పుడు వెంటనే 1912కు, సమీప ఫ్యూజ్ ఆఫ్ కాల్‌కు కాల్ చేసి విద్యుత్ సిబ్బందికి తెలియజేయాలి. 7.మండపాలకు విద్యుత్ కనెక్షన్ కోసం ప్రయివేటు వ్యక్తులు ఇష్టానుసారంగా స్తంభాలు ఎక్కొద్దు. స్థానిక విద్యుత్ కార్యాలయంలో సంప్రదిస్తే సిబ్బంది కనెక్షన్లు ఇస్తారు. 8.విద్యుత్ తీగలకు ఇష్టానుసారంగా వైర్లు వేస్తుండడంతో ఈదురుగాలుల వీచినప్పుడు అవి కిందపడి షార్ట్ సర్క్యూట్ జరిగే ప్రమాదాలుంటాయి. 9. నడిచే ప్రాంతాల్లో తీగలు ఉండకుండా చూసుకోవాలి. విద్యుత్ వైర్లు, స్తంభాలకు అంటి పెట్టుకునేలా మండపాలు ఏర్పాటు చేయొద్దు. 10.మెటల్ ఫ్రేమ్‌లతో కూడిన డెకరేషన్ వస్తువులు తీగలకు దూరంగా ఉంచాలి. 11.విద్యుత్ లైన్ల నుంచి మండపాలు కనీసం రెండు అడుగుల దూరంలో ఉండేలా జాగ్రత్తలు పాటించాలి. 12.ప్రతి మండపంలో స్థానిక ఏఇ, లైన్‌మన్, సిబ్బంది ఫోన్ నెంబర్లు, టోల్ నెంబర్ 1912 ఉండేలా చర్యలు తీసుకోవాలి. 13.భారీ విగ్రహాలు తరలించే సమయంలో క్రేన్లు, ట్రక్కులపై ఏర్పాటు చేసే డెకరేషన్ పరికరాలు తీగలకు తగలకుండా జాగ్రత్తలు పాటించాలి. 14.విగ్రహాలు తరలించే మార్గాల్లో విద్యుత్ వైర్లు ఉంటే తడి కర్రలు, ఇనుప వస్తువులతో పైకి నెట్టే ప్రయత్నాలు చేయొద్దు.

అప్రమత్తంగా ఉండండి - ముషారఫ్ ఫరూఖి, సిఎండి, టిజి ఎస్పీడిసిఎల్

గణేష్ విగ్రహాల తరలింపులో, మండపాల్లో విద్యుత్ పట్ల అప్రమత్తంగా ఉండాలి. గ్రేటర్ హైదరాబాద్ నగరంలో ఇప్పటికే ప్రమాదకరంగా ఉన్న ఎల్‌టి /11 కెవి నెట్‌వర్క్‌లోని ఓవర్ హెడ్ లైన్ల స్థానంలో ఎబి కేబుల్ ఏర్పాటు చేసే కార్యక్రమం ముమ్మరంగా సాగుతున్నది. సామాన్య ప్రజలు, గణేష్ నిర్వాహకులు మండపాల వద్ద భద్రతా చర్యలు పాటించాలి. ఏమైనా సమస్యలు ఏర్పడితే వెంటనే విద్యుత్ అధికారులు సమాచారం ఇవ్వాలి. అనుమతి పొందిన గణేష్ మండపాలకు ఉచితంగానే విద్యుత్ సరఫరా చేస్తున్నాం.

210 మంది ట్రాన్స్‌జెండర్లకు గుర్తింపు కార్డులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో 210 మంది ట్రాన్స్ జెండర్లకు గుర్తింపు కార్డులను అందజేశారు. ఆధార్ అప్‌డేషన్, గుర్తింపు కార్డులు పొందే విషయంలో ట్రాన్స్ జెండర్లు ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించేందుకు హైదరాబాద్‌లోని మలక్ పేటలో గల రాష్ట్ర వికలాంగులు, సీనియర్ సిటీజన్స్, ట్రాన్స్ జెండర్ల శాఖ సంచాలకుల కార్యాలయంలో మంగళవారం రాష్ట్రస్థాయి ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేశారు.

ఈ శిబిరానికి కీర్ బంధు పేరెంట్స్ అసోసియేషన్, వాసవి కిన్నెర్ వెల్ఫేర్ సొసైటీ, అలయెన్స్ ఇండియా, వికల్ప్ (ప్రజ్వల) సహకారం అందించాయి. శిబిరంలో గుర్తింపు కార్డులతో పాటు ఆధార్ అప్ డేషన్, కొత్తగా నమోదు సేవలను అందించారు. కార్యక్రమంలో ఆ శాఖ సంచాలకురాలు బి.శైలజ తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ నరసరావుపేట ప్రిన్సిపల్ సివిల్ జడ్జ్ (జూనియర్ డివిజన్) గారి కోర్టులో
O.S. NO:336/2021
బిట్వీన్ :
షేక్ జాన్బి మరియు ఇతరులు మరియు ...వాదులు
మరియు
షేక్ సుభాని మరియు ఇతరులు. ...ప్రతివాదులు
To,
R18) షేక్ జిక్రియా S/o లేటు మహబూబ్, రోడ్ నెంబర్ 5, మధురానగర్ కాలనీ, నేరేడుమెట్ల X రోడ్స్, సికింద్రాబాద్- 500094 మరియు ప్రస్తుతం C/o షేక్ అబ్దుల్ జబ్బర్, D.No; 15-7-12/A, పనస తోట, నరసరావుపేట పట్టణం, గుంటూరు జిల్లా.
R19) షేక్ షబీరా W/o రెహమాన్ R/O H.NO:- 37- 93-137/9, రోడ్ నెంబర్ 5, మధురానగర్ కాలనీ, సైనిక్ పూరి, నేరేడుమెట్ల X రోడ్స్ సికింద్రాబాద్ 500094
పై నెంబర్ దావాలో మీకు శ్రీ కోర్ట్ వారి ఉత్తర్వులు ప్రకారం ఎన్నిసార్లు నోటీసులు పంపినను మీరు తీసుకోనందున ఈ పేపర్ ప్రకటన ద్వారా పై కోర్టు వారి ఎదుట ది. 12-09-2025 న ఉదయం 10:30 గం.ని లకు హాజరు కాబడి మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్ష మందు తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియ జేయడమైనది.
వాయిదాతేది : 12-09-2025
ఇట్లు.
ఎస్.జి ఎస్.పి నాగేశ్వరరావు,
అడ్వకేట్, నరసరావుపేట,
పల్నాడు జిల్లా.

నోటీసు
మహారాజశ్రీ 3వ అదనపు జిల్లాజడ్జి కోర్టు, ఒంగోలు
I.A. 20/25 in I.A. 154/22
in O.S. 98/18
Between :
కాలువ దేదీప్య ... పిటీషనరు/వాది
మరియు
1) కాలువ వెంకటాచలం మరియు 4 ఇతరులు .... రెస్పాండెంట్స్ / ప్రతివాదులు 1 to 5
2) దాసరి శివకుమారి మరియు 2 ఇతరులు ... ప్రతిపాదిత రెస్పాండెంట్స్ 6 to 8
To,
Praposed Respondent No.8
దాసరి బాలకృష్ణ, S/o Late హనుమంతరావు, Presently O/o IBM Services, గచ్చిబౌలి ఏరియా, హైదరాబాద్, తెలంగాణా.
పై కేసులో మిమ్ములను పార్టీగా చేరుస్తూ I.A. No. 20/25 పిటీషన్ దాఖలు చేయగా, నోటీసులు తీసుకొనని కారణంగా I.A. 441/25 లో 6-8-2025 న పేపరు ప్రకటన ద్వారా నోటీసులు ఆర్డరు వేసి వున్నారు. కావున 2025 సం॥ 9వ నెల 12వ తేదీన పగలు 10 గం.లకు నీవు స్వయంగా గానీ, వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరయి వారితో మనవి చేసుకోవలసినది. లేనియెడల సదరు విషయమై నీ పరోక్షమున విచారించి తీర్మానం చేయుదురని తెలియ చేయడమైనది.
వాయిదాతేది : 12-9-2025
కె.వరప్రసాద్,
పిటీషనర్ తరపు న్యాయవాది,
గుంటూరు. సెల్ : 7893862499

చిత్రకళకు పుట్టినిల్లు తెలంగాణ

- స్టేట్ ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్ లక్ష్మి కొర్ర

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

చిత్రకళకు తెలంగాణ పుట్టినిల్లని తెలంగాణ స్టేట్ ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్ డాక్టర్ లక్ష్మి కొర్ర అన్నారు. హైదరాబాద్‌లోని మాదాపూర్ స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో అంతర్జాతీయ చిత్రకారుడు కట్టకూరి రవి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన "నేషనల్ సోలో ఎగ్జిబిషన్-2025" మంగళవారం సందర్శించారు. చిత్రాల ముఖ్య ఇతివృత్తం స్త్రీ సౌందర్యం... జీవం ఉట్టిపడేరీతిలో తీర్చిదిద్దిన చిత్రాలను ఆద్యంతం కలియ తిరిగి పరిశీలించారు.

అనంతరం ఆమె మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలు ప్రతిబింబించే రీతిలో రూపొందించిన కళా ఖండాలు అద్భుతంగా ఉన్నాయని కొనియాడారు. తెలుగు రాష్ట్రాల్లో... ప్రత్యేకించి హైదరాబాద్‌లో చిత్రకళకు అత్యంత ఆదరణ ఉందని అన్నారు. చిత్రకళలో కృషి చేస్తున్న వారికి అవసరమైన సహాయ, సహకారాలు ప్రభుత్వ పరంగా అందిస్తామని ఈ సందర్భంగా ఆమె ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఎసిపి యలమద్ధి నాగేశ్వరరావు, పలువురు విశిష్ట కళాకారులు పాల్గొనున్నారు.

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు

- ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి భరోసా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఆన్‌లైన్‌లో తలెత్తుతున్న పలు సమస్యలు తమ దృష్టికి వచ్చాయని ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి తెలిపారు. అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు తప్పకుండా వస్తాయనీ, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ప్రజాప్రతినిధుల ముఖాముఖీ కార్యక్రమంలో పలువురి నుంచి ఫిర్యాదులు స్వీకరించారు.

అనంతరం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టిపిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ ఆదేశాల మేరకు ప్రజాప్రతినిధుల ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రజల నుంచి వచ్చి వినతులను స్వీకరించి సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి వినతులే ఎక్కువగా వచ్చాయని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల అప్‌లోడ్ చేసే క్రమంలో కొన్ని రిజెక్టు అవుతున్నాయని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు పోతోందని చెప్పారు.

ఆశ్వారావుపేట లక్ష్మీ ప్రసన్న మృతి కేసులో.. ముగ్గురు అరెస్ట్,

- పరారీలో ఒకరు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో మూడు రోజుల కిందట అనుమానాస్పదంగా మృతిచెందిన పూల లక్ష్మీ ప్రసన్న కేసులో పోలీసులు ముగ్గురిని అరెస్ట్ చేయగా, ఒకరు పరారీలో ఉన్నట్టు సీఐ నాగరాజు రెడ్డి మంగళవారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన ఎస్ఐ యయాతి రాజు నిందితులుగా తేలిన మృతురాలి భర్త నరేష్ బాబు, అతని సోదరి భూ లక్ష్మి, తల్లి విజయలక్ష్మిని సీఐ నాగరాజు సమక్షంలో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మరొక నిందితుడు శ్రీనివాసరావు పరారీలో ఉన్నట్టు పేర్కొన్నారు. పరారీలో ఉన్న నిందితుని కోసం స్పెషల్ టీమ్ ఏర్పాటు చేసి గాలిస్తున్నామని, అతన్ని త్వరలో అదుపులోకి తీసుకొని దర్యాప్తు వేగవంతం చేస్తామని సీఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్ఐ వి.రామ్మూర్తి, శిక్షణా ఎస్ఐ అఖిల ఉన్నారు.

ఆర్‌టిసి బస్సులో మంటలు

- ప్రయాణికులు సురక్షితం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ మెహిదీపట్నం బస్టాండ్‌లో మంగళవారం ఆర్‌టిసి బస్సులో మంటలు చెలరేగాయి. బస్సు ముందు భాగం దగ్ధమైంది. అప్పటికే ప్రయాణికులంతా దిగిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. వివరాల్లోకెళ్తే.. మెహిదీపట్నం డిపోకు చెందిన ఆర్‌టిసి బస్సు లింగంపల్లి నుంచి మెహిదీపట్నం వచ్చింది. అదే సమయంలో బస్సు ఒక్కసారిగా ఆగిపోయింది. దాంతో డ్రైవర్ రోడ్డు పక్కన నిలిపివేశాడు. సెల్ఫ్ స్టార్ట్ చేసేందుకు ప్రయత్నించగా స్టార్ట్ కాలేదు. ఈ క్రమంలో ప్రయాణికులందరూ కిందకు దిగిపోయారు. ఆ తరువాత డ్రైవర్ బానెట్ ఓపెన్ చేసి కేబుల్స్ సరి చేసే ప్రయత్నం చేశాడు. అదే సమయంలో ఇంజిన్ భాగంలో మంటలు చెలరేగడంతో ఆయన కిందకు దిగిపోయి పోలీసులకు, ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. పోలీసులు, ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పేశారు. అప్పటికే బస్సు ముందు భాగం పూర్తిగా కాలిపోయింది. ఆర్‌టిసి అధికారులు బస్సును పరిశీలించారు.

యూరియా కోసం కొనసాగిన ఆందోళనలు

- పిఎసిఎస్‌ల వద్ద ధర్నాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఒకవైపు రాష్ట్రంలో వర్షాలు కురుస్తున్నాయి. దాంతో పత్తి, మొక్కజొన్న, వరి, కంది తదితర పంటలను రక్షించుకునేందుకు రైతులు పడరానిపాట్లు పడుతున్నారు. పంటలకు యూరియా చల్లేందుకు రైతులు అన్ని పనులు వదిలేసుకొని పీఏసీఎస్ కేంద్రాల వద్ద పడిగాపులుకాస్తున్నారు. తెల్లవారుజాము నుంచే పీఏసీఎస్ కేంద్రాల వద్ద నిల్చున్నా యూరియా అందడం లేదు. రాష్ట్రానికి యూరియాను పంపిచాల్సిన కేంద్రం చూస్తూ పట్టించుకోవడం లేదు. అధికారులు మాత్రం పండుగ తర్వాతే యూరియా వస్తుందని చెబుతున్నారు. వచ్చిన రైతుల నుంచి ఆధార్ కార్డులు, పట్టా పాస్ పుస్తకాలు స్వీకరించి టోకెన్లు అందిస్తున్న పరిస్థితి ఉంది. రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో ఇదే పరిస్థితి కొనసాగుతుండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీరికి సిపిఎం, బిఆర్ఎస్, రైతు సంఘం, తదితర ప్రజాసంఘాలు మద్దతు తెలుపుతూ ఆందోళనలో పాల్గొంటున్నాయి.

మెదక్ జిల్లా నర్సాపూర్ వ్యవసాయ సహకార కేంద్రం వద్దకు రైతులు ఉదయమే పెద్దఎత్తున తరలివచ్చారు. యూరియా రాలేదని తెలుసుకున్న రైతులు అంబేద్కర్ చౌరస్తాలో గంటపాటు రాస్తారోకో, ధర్నా చేపట్టారు. ఎమ్మెల్యే సునీతారెడ్డి రైతులకు మద్దతుగా కూర్చున్నారు. తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్ సిబ్బందితో కలిసి ఎమ్మెల్యేకు, రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఎమ్మెల్యేని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండల కేంద్రంలో అన్నదాతలు ఆరు గంటల పాటు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఫర్టిలైజర్ వ్యాపారులు టోకెన్లు రాయించుకొని ఇష్టం వచ్చినవారికి యూరియా అందిస్తూ మిగతా రైతులను పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. టోకెన్లు ఇచ్చిన రైతులకు రెండు రోజుల్లో యూరియాను అందిస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో రైతులు ధర్నాను విరమించారు. మహబూబ్‌నగర్ జిల్లా నవాబుపేట మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు రోడ్డుపై బైటాయించి నిరసన తెలిపారు. బాలానగర్ మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాల వద్ద రైతులు పాసుబుక్కులు పట్టుకొని బారులు తీరారు. వనపర్తి జిల్లా ఆత్మకూరు పట్టణంలోని ప్రాథమిక వ్యవసాయ సంఘం కార్యాలయానికి మంగళవారం ఉదయం ఒక లారీలో 300 బ్యాగుల యూరియా రావడంతో ముందస్తుగా టోకెన్లు తీసుకున్న రైతులకు పంపిణీ చేశారు. జోగులాంబ గద్వాల జిల్లా గద్వాల పట్టణంలో పీఏసీఎస్ కార్యాలయం ముందు క్యూలైన్‌లో నిలబడ్డారు.

రంగారెడ్డి జిల్లా యాచారం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద సిపిఎం నాయకులు రైతులతో కలిసి నిరసన తెలిపారు. వికారాబాద్ జిల్లా మర్పల్లిలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో న్యూ బస్టాండ్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు రైతులతో కలిసి ర్యాలీ నిర్వహించారు.

నల్లగొండ జిల్లాకేంద్రంలోని సిపిఎం కార్యాలయం నుంచి జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయం వరకు రైతులతో కలిసి నిరసన ప్రదర్శన నిర్వహించారు. జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయం ఎదుట రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. వేములపల్లి మండలం సల్కునూర్ పిఎసిఎస్ వద్ద రైతులు చెప్పులు లైన్‌లో పెట్టి బార్లు తీరారు. సూర్యాపేట జిల్లా చిలుకూరు మండల కేంద్రంలోని బేతవోలు సహకార సంఘ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. హనుమకొండ జిల్లా పరకాలలోని మాదరం సొసైటీ దగ్గర 5 గంటలకే క్యూ లైన్ మొదలైంది. 360 బస్తాలు మాత్రమే రావడంతో రైతులు తోసుకోవడంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. జయశంకర్-భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఎదుట రైతులు బారులు తీరారు.

మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డిని అరెస్ట్ చేయాలి

- టిజెఎస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఫార్మాసిటీ, భూదాన్ భూముల్లో అక్రమాలకు పాల్పడిన ఇబ్రహీంపట్నం మాజీ మ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డినీ, అప్పటి ఆర్‌డిఒ వెంకటాచారిని వెంటనే అరెస్ట్ చేయాలని తెలంగాణ జన సమితి (టిజెఎస్) డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె వినయ్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ధార సత్యం ఒక ప్రకటన విడుదల చేశారు. యాచారం మండలం, తాడిపర్తి గ్రామం సర్వే నెంబర్ 104లో గల 250 ఎకరాల భూదాన్ భూముల విషయంలో మంచిరెడ్డి ప్రోత్సాహంతో వెంకటాచారి దొంగ పాస్ పుస్తకాలను మంజూరు చేసి వారికి అనుకూలంగా ఉన్న వారికి నష్టపరిహారం ఇప్పించారని వారు ఆరోపించారు. గ్రామానికి చెందిన దళితులకు నష్టపరిహారం చెందాలని పోరాడిన ధార సత్యంపై అక్రమంగా కేసులు బనాయించగా, వీటిపై సీఎం రేవంత్ రెడ్డి స్పందించారని కృతజ్ఞతలు తెలిపారు. వెంటనే అక్రమార్కులను అరెస్టు చేసి వారి నుంచి నష్ట పరిహారం డబ్బును రికవరీ చేయాలని డిమాండ్ చేశారు.

ఎంపి విశ్వేశ్వర్‌రెడ్డి వినూత్న నిరసన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో బిజెపి వ్యవహారంపై ఆ పార్టీ చేవెళ్ల ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. బిజెపి రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీకి కానుకగా ఫుట్‌బాల్ ఇచ్చి నిరసన తెలిపారు. రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో పార్టీ వ్యవహారంపై విశ్వేశ్వర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీలో తనను ఫుట్‌బాల్ ఆడుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రశేఖర్ తివారీని కలిస్తే.. రామచందర్ రావును కలవమంటున్నారు. రామచందర్‌రావును కలిస్తే.. అభయ్ పాటిల్‌ను కలవమంటున్నారు. ఒకరిని కలిస్తే మరొకరి పేరు చెబుతున్నారని మండిపడ్డారు. జిల్లా అధ్యక్షుల తీరు, పార్టీ కార్యక్రమాల్లో సమన్వయ లోపంపై తన అసంతృప్తిని వ్యక్తం చేశారు.

మార్షల్ ఆర్ట్స్‌లో ఎన్‌బికెఎ విద్యార్థుల సత్తా

- 3 స్వర్ణ, 4 రజత, 3 కాంస్య పతకాలు కైవసం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మార్షల్ ఆర్ట్స్‌లో ఎన్‌బికెఎ ఫిట్‌నెస్ ఫ్రీక్ బ్రాంచ్ విద్యార్థులు సత్తా చాటారు. మూడు స్వర్ణ, నాలుగు రజత, మూడు కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. హైదరాబాద్‌లోని కోట్ల విజయ్ భాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో ఆగస్టు 24న ఇంటర్నేషనల్ ఓపెన్ టు స్పోర్ట్స్ ఆల్ స్టైల్స్ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్‌షిప్ 2025 జరిగింది. ఈ అంతర్జాతీయ ఛాంపియన్‌షిప్‌లో వారు బ్రాంచ్ మాస్టర్ రేవంత్ మార్గదర్శకత్వంలో అద్భుత ప్రతిభ కనబరిచారు. కాటా, కుమితే విభాగాల్లో వారు పతకాలను సాధించి తమ అకాడమికి గొప్ప గౌరవాన్ని, గుర్తింపును తీసుకొచ్చారని మాస్టర్ రేవంత్ హర్షం వ్యక్తం చేశారు.

సెప్టెంబర్ 2న ల్యాబ్ టెక్నీషియన్ల ఫైనల్ లిస్ట్

- 8 నుంచి 12 వరకు వెరిఫికేషన్
- 12 తర్వాత పది రోజుల్లో ఫైనల్ సెలక్షన్ లిస్ట్
- ఎంహెచ్ఎస్ఆర్‌బి కార్యదర్శి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్ 2 పోస్టులకు సంబంధించిన ఫైనల్ లిస్ట్‌ను సెప్టెంబర్ 2న విడుదల చేయనున్నట్టు మెడికల్, హెల్త్ సర్వీసెస్ రిక్రూట్ మెంట్ బోర్డు కార్యదర్శి తెలిపారు. మంగళవారం తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు అనుబంధం) గౌరవాధ్యక్షులు భూపాల్ నేతృత్వంలో ల్యాబ్ టెక్నీషియన్ పరీక్ష రాసిన అభ్యర్థులు ఫైనల్ లిస్ట్ చేయాలంటూ బోర్డు కార్యదర్శికి వినతిపత్రం ఇచ్చేందుకు జిల్లాల నుంచి పెద్ద ఎత్తున తరలి వచ్చారు. వినతిపత్రం తీసుకునేందుకు లోపలికి అనుమతించకపోవడంతో అక్కడ పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. వచ్చిన అభ్యర్థులు ఎక్కువ సంఖ్యలో ఉండటం, మెడికల్ బోర్డు పనితీరును నిరసిస్తూ నినాదాలు చేశారు. అప్పటికే రంగంలోకి దిగిన పోలీసులు వారిని నిలువరించేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. అక్కడే ధర్నాకు బైఠాయించిన భూపాల్‌ను పోలీసులు బలవంతంగా అరెస్ట్ చేసి వాహనంలోకి ఎక్కించారు. అభ్యర్థులు పోలీసుల కారుకు అడ్డంగా నిలబడి 'భూపాల్ నాయకత్వం వర్థిల్లాలి...భూపాల్ నాయకత్వం వర్థిల్లాలి..' అంటూ నినాదాలు చేశారు. అభ్యర్థులు పెద్ద సంఖ్యలో ఉండి పోలీసులను నిలదీశారు. దీంతో అభ్యర్థులకు, పోలీసులకు మధ్య కొద్ది సేపు వాగ్వాదం జరిగింది. 'పోలీసుల జులుం నశించాలంటూ, తమకు న్యాయం చేయాలంటూ, ఇదేమీ రాజ్యం, ఇదేమి రాజ్యం...దొంగల రాజ్యం, దోపిడీ రాజ్యమంటూ..' నినాదాలు చేశారు. దీంతో పోలీసులు భూపాల్‌ను వదిలేశారు. అనంతరం బోర్డు కార్యదర్శి ధర్నాకు వచ్చిన అభ్యర్థుల నుంచి వినతిని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ ఎనిమిది నుంచి 12 వరకు వెరిఫికేషన్ పూర్తి చేసి, మరో పది రోజుల్లో ఫైనల్ సెలక్షన్ లిస్ట్ విడుదల చేస్తామని చెప్పడంతో అభ్యర్థులు ధర్నా విరమించారు.

అంతకుముందు ధర్నానుద్దేశించి భూపాల్ మాట్లాడుతూ ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-2కు సంబంధించి 1,284 పోస్టుల కోసం నోటిఫికేషన్ జారీ చేసి ఏడాది గడిచిందని తెలిపారు. నియామక ప్రక్రియ ఆలస్యం చేస్తుండటం, స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ వస్తే మరింత ఆలస్యమవుతుందని అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. వారి ఆందోళనను అర్థం చేసుకుని సాధ్యమైనంత తొందరగా నియమకాలను పూర్తి చేయాలని ప్రభుత్వానికి, అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాలకు చెందిన ల్యాబ్ టెక్నీషియన్లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సౌరవ్ భరద్వాజ్‌పై నిరాధార ఆరోపణలు

- డాక్టర్ దిడ్డి సుధాకర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆమ్ ఆద్మీ పార్టీ ఢిల్లీ అధ్యక్షులు సౌరవ్ భరద్వాజ్‌పై ఇడి చేసిన ఆరోపణలు నిరాధారామైనవని ఆ పార్టీ తెలంగాణ కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ కొట్టిపారేశారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు.

సౌరవ్ భరద్వాజ్‌పై ఇడి చేస్తున్న ఆరోపణలు ఆయన ఆరోగ్య మంత్రిగా లేని కాలానికి చెందినవని తెలిపారు. గతంలో ఢిల్లీ ఆరోగ్యశాఖ మాజీ మంత్రి సత్యేంద్ర జైన్‌ను మూడేళ్లు జైళ్లో ఉంచిన తర్వాత సిబిఐ ఆయనకు క్లీన్ చిట్ ఇచ్చిందని గుర్తుచేశారు. ఇడి, సిబిఐ కేసులతో బీజేపీ తన వ్యతిరేకులను బెదిరించి కమలం పార్టీలో చేర్చుకుందనీ, అలాంటివేవి ఆప్ దగ్గర కుదరవని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆప్ నాయకులు బుర్రా రాములు గౌడ్, విజయ్ మల్లంగి, యమున గౌడ్, హేమ జిల్లోజు, జావీద్ షరీఫ్, శివాజీ, దర్శనం రమేష్, అజీమ్ బైగ్ పాల్గొన్నారు.

రవినాయక్ దుర్మరణం

- రేవంత్ రెడ్డి సర్కారు చేసిన హత్య : హరీశ్ రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రైతు రవినాయక్ మరణం రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేసిన హత్య అని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేసింది. తెలంగాణలో వ్యవసాయం పూర్తిగా కుప్పకూలిపోయిందనే విషాదాన్ని మరోసారి ఈ రైతు దుర్మరణం రుజువు చేసిందని తెలిపారు. అప్పుల బాధతో మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం ఈర్లపల్లిలో రవి నాయక్ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కలిచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్య సేవలు అందించడంలో ప్రభుత్వ ఆస్పత్రులు చూపిన నిర్లక్ష్య వైఖరి రైతు మరణానికి కారణం అయిందని ఆరోపించారు. రైతుల ఆవేదనను పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాథమిక వైద్య సేవలు అందించడంలో కూడా విఫలమైందని మండిపడ్డారు. ఇది కేవలం ఆస్పత్రుల నిర్లక్ష్యమే కాదనీ, రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేసిన హత్య అని పేర్కొన్నారు. రైతులను నిరాశలోకి నెట్టి, ఇటు జీవితంలో అటు మరణంలోనూ వారికి గౌరవం లేకుండా చేసినందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం బాధ్యత వహించాలని హెచ్చరించారు.

ఉద్యోగోన్నతుల కోసం 2012 బ్యాచ్ ఎస్ఐల నిరీక్షణ

- ఖాళీలు లేవని సాకుతో కాలయాపన
- కొన్ని విభాగాల్లో అనేక పోస్టులు భర్తీ చేయకపోవడమే కారణం



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర పోలీస్ శాఖలో అరుదైన పరిస్థితి నెలకొంది. 2012 బ్యాచ్ సబ్ ఇన్‌స్పెక్టర్లు (ఎస్ఐలు) ప్రమోషన్ల కోసం ఎదురు చూస్తున్నారు. 13 సంవత్సరాలుగా విధులు నిర్వర్తిస్తున్నప్పటికీ, వారిలో వందలాది మందికి ఇప్పటికీ ప్రమోషన్లు లేక తీవ్ర నిరాశలో ఉన్నారు. ప్రమోషన్ అనేది వారికి ఆత్మగౌరవ సమస్య అయింది. "ఖాళీలు లేవు" అని కారణం చెబుతూ, కొంతమందికి ప్రమోషన్లు ఇచ్చి, మిగిలిన వారిని పక్కన పెట్టడం పట్ల తోటి ఎస్ఐలలో తీవ్ర ఆవేదన వ్యక్తమవుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా 2012 బ్యాచ్‌కు సంబంధించి 360 మంది ఎస్ఐలు ఉండగా 60 మందికి మాత్రమే ప్రమోషన్లు లభించాయి. మిగతా 300 మందికి రాలేదు. ఏండ్ల తరబడి వారు ఎదురు చూస్తున్నారు. మిగిలినవారి విషయంలో అధికారులు నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రమోషన్లు నిలిచిపోవడంతో వారిలో ఉత్సాహం, పనిపై శ్రద్ధ పెట్టలేకపోతున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఖాళీల లెక్క కాకి ఎత్తుకుపోయిందా?

విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. ఇప్పటికే అనేక విభాగాల్లో వందలాదిగా పోస్టులు ఖాళీగా ఉన్నాయని వివరాలు ఉన్నాయి. ముఖ్యంగా తెలంగాణ నార్కోటిక్స్ బ్యూరో (టిజిఎన్ఎబి), టిఎస్ ఆర్‌టిసి భద్రతా విభాగం, క్రైమ్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ (సిఐడి), ఇంటెలిజెన్స్, విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో 23 పోస్టులు, అవినీతి నిరోధక శాఖ (ఎసిబి)లో 43 పోస్టులు, హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్‌లు, రోడ్ సేఫ్టీ, మెట్రో భద్రతా విభాగం, డయల్-112 ప్రత్యామ్నాయ స్పందన వ్యవస్థ, రాష్ట్ర మానవ హక్కుల సంఘం, రాజ్‌భవన్ భద్రత, రైల్వే పోలీస్ విభాగంతో పాటు విభాగాల వారీగా అనేక ఖాళీలు ఉన్నాయి. వీటిని భర్తీ చేస్తే ప్రమోషన్లు కూడా లభిస్తాయని పోలీసులు అంటున్నారు.

అసలుకే ఎసరు.. ఆత్మగౌరవం పట్టించుకోరూ..?

ప్రమోషన్ల సమస్యను పలుమార్లు ప్రతిపాదించినా, కేడర్ రివ్యూ-ఖాళీల లభ్యత పేరుతో ఉన్నతాధికారులు కాలయాపన చేస్తున్నారని ఎస్ఐలు ఆరోపిస్తున్నారు. ఒకేసారి ఎంపికైన తమలో కొంతమందికి ప్రమోషన్లు ఇచ్చి మరికొందరికి మొండిచేయి చూపడం పోలీసువర్గాలకే కాక సమాజానికీ నష్టం అవుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. పోలీసు ఉద్యోగం ఎప్పటికీ ఒత్తిడి, మానసిక భారంతో కూడినదే. అలాంటి వాతావరణంలో ప్రజలకు భరోసా కల్పించే స్థాయికి వచ్చిన ఎస్ఐలకు సకాలంలో ఉద్యోగోన్నతులు లభించకపోతే, అది మొత్తం పోలీసు వ్యవస్థలో క్రమశిక్షణ, ఉత్సాహాన్ని దెబ్బతీసే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అందుకే, 2012 బ్యాచ్ ఎస్ఐల ఆత్మగౌరవ సమస్యను పరిష్కరించడానికి ప్రభుత్వం, పోలీస్ ఉన్నతాధికారులు వెంటనే జోక్యం చేసుకోవాలని పోలీసువర్గాలు కోరుతున్నాయి.

ఎస్‌టిలకు అన్యాయం చేస్తే ఉపేక్షించం

- రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎస్‌టిలకు అన్యాయం చేస్తే ఉపేక్షించమని రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ చైర్మన్ బక్కివెంకటయ్య అన్నారు. ఎస్‌టిల ప్రత్యేక అభివృద్ధి నిధులు కాగితాల మీద చూపెడుతూ.. ఖర్చు నామ మాత్రంగా చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వెచ్చించిన నిధులు ఖర్చు చేయకపోతే తరతరాలుగా వెనుకబాటుకు గురైన గిరిజనుల సంక్షేమం, అభివృద్ధి ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. మంగళవారం హైదరాబాద్‌లోని డిఎస్-ఎస్‌భవన్‌లో సంబంధిత అధికారులతో గిరిజన అభివృద్ధి నిధులపై సమీక్ష నిర్వహించారు. నోడల్ ఏజెన్సీ సమావేశాలు జరుగుతున్నాయా అని ఆరా తీశారు. మార్చిలో జరిగిందని అధికారులు సమాధానం ఇవ్వగా, ఎస్‌సి, ఎస్‌టి కమిషన్‌ను ఎందుకు పిలవడం లేదని నిలదీశారు. "2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.15,232 కోట్లను కేటాయించగా, కేవలం రూ.10,400 కోట్లను ఖర్చు చేశారు. గిరిజన శాఖకు కేటాయించిన రూ.3,025 వేల కోట్లలో కేవలం రూ.1728 కోట్లను మాత్రమే ఖర్చు చేశారు. ఎస్‌టిలకు కేటాయించిన నిధులను ఖర్చు చేయడంలో అధికారులు ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారు" అని వెంకటయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగ నియామకాలు, బదిలీలు, ప్రమోషన్లలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించకుండా అన్యాయం చేస్తే ఊరుకోమని హెచ్చరించారు. ఇంజనీరింగ్ శాఖ, గురుకులాలు, హస్టళ్లు, అటవి హక్కుల చట్టం, ట్రైకార్, జిసిసి తదితర అంశాలపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమావేశంలో ట్రైకార్ చైర్మెన్ బెల్లయ్య నాయక్, కమిషన్ సభ్యులు నీలాదేవి, రాంబాబు నాయక్, కొంకటి లక్ష్మినారాయణ, రేణికుంట ప్రవీణ్, జిల్లా శంకర్, గిరిజిన సంక్షేమ శాఖ ఇన్‌చార్జి ముఖ్య కార్యదర్శి అలగు వర్షిణి, కమిషనర్ సీతాలక్ష్మి ఇతర ఉన్నాతాధికారులు పాల్గొన్నారు.

అంతా రెడీ... అయినా ప్రారంభమెప్పుడో?

- గాంధీ ఆస్పత్రిలో సిద్ధమైన ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్ సెంటర్
- ఆలస్యానికి సమన్వయ లోపమే కారణమా?

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అవయవదానాల్లో తెలంగాణ దేశంలోనే అగ్రగామిగా నిలిచింది. ఈ మేరకు దేశవ్యాప్తంగా అన్ని వైపుల నుంచి ప్రశంసలందుకుని ఆదర్శంగా నిలిచింది. జీవన్‌దాన్ ద్వారా అవయవదాతల నుంచి సేకరించిన అవయవాలను స్వీకర్తలకు అందిస్తూ మరణపు అంచుల్లోకి చేరిన బాధితులకు కొత్త జీవితాన్ని ప్రసాదిస్తున్నారు. అయితే బ్రెయిన్ డెడ్ డిక్లరేషన్‌లో గాని, అవయవమార్పిడి శస్త్రచికిత్సల్లో గానీ ప్రభుత్వాస్పత్రుల కన్నా కార్పొరేట్ ఆస్పత్రులే క్రియాశీలక పాత్ర పోషిస్తున్నాయి. ప్రభుత్వాస్పత్రుల్లో కార్పొరేట్ ఆస్పత్రులకు పోటీ పడుతూ అప్పుడప్పుడు చేసే అవయవమార్పిడి శస్త్రచికిత్సలు ఆ ఆస్పత్రుల్లోని వైద్యుల నైపుణ్యతకు అద్దం పడుతున్నాయి. సౌకర్యాలు కల్పిస్తే ఆ కార్పొరేట్లకు ఏ మాత్రం తీసిపోకుండా ప్రాణాలు నిలుపుతారనడంలో అతిశయోక్తి లేదు. ప్రస్తుతం ఉస్మానియా ఆస్పత్రితో పాటు నిమ్స్‌లో అవయవమార్పిడి శస్త్రచికిత్సలు జరుగుతున్నా.... రాష్ట్రంలో జరుగుతున్న మొత్తం అవయవమార్పిడి శస్త్రచికిత్సల్లో వాటి సంఖ్య నామమాత్రమనే చెప్పాలి. ప్రభుత్వాస్పత్రుల్లో అవయవమార్పిడి శస్త్రచికిత్సలను పెద్ద ఎత్తున ప్రోత్సహించే ఉద్దేశంతో హైదరాబాద్ గాంధీ ఆస్పత్రిలో అవయవమార్పిడి శస్త్రచికిత్స కేంద్రాన్ని తలపెట్టారు.

గాంధీ ఆస్పత్రి ఐపి బ్లాక్‌లోని 8వ అంతస్తులో 25 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో 6 ఆపరేషన్ థియేటర్లు, 3 ఐసోలేషన్ రూంలు, 3 ఐసియులు, పిజి విద్యార్థులు శస్త్రచికిత్సలను ప్రత్యక్షంగా చూసేందుకు వీలుగా లైవ్ టెలికాస్ట్ కోసం ప్రత్యేకంగా సెమినార్ రూం, పోస్ట్ ఐసియు లాంటి ఆధునాతన హంగులతో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఉస్మానియా, నిమ్స్‌లో కొన్ని అవయవాల మార్పిడి శస్త్రచికిత్సలు జరుగుతుండగా, గాంధీలో అన్ని అవయవాలను మార్పిడి చేసే విధంగా హై ఎండ్ పరికరాలను సమకూర్చినట్టు

అధికారులు తెలిపారు. మూత్రపిండాలు, గుండె, ఊపిరితిత్తులు, కాలేయం తదితర అవయవమార్పిడి శస్త్రచికిత్సలన్ని చేసే విధంగా కేంద్రాన్ని తలపెట్టారు. ఆపరేషన్ థియేటర్లలో రెండింటినీ జనరల్ సర్జరీస్ కోసం ఉద్దేశించారు.

2022 జూన్ 7న రూ.35 కోట్లతో సెంటర్ ఏర్పాటుకు పరిపాలనాపరమైన అనుమతులిచ్చారు. దీంతో టిజిఎంఐడిసి చేసుకున్న కాంట్రాక్ట్ ఒప్పందం మేరకు సెంటర్ ఈ ఏడాది ఫిబ్రవరి 24 నాటికి అందుబాటులోకి రావాల్సి ఉంది. అయితే నిర్దేశిత గడువులోపు పూర్తి కాకపోవడంతో ఈ ఏడాది మే నాటికి పూర్తి చేసేందుకు మరోసారి పొడిగింపునిచ్చారు. అయినప్పటికీ ఆ సమయానికి కూడా అందుబాటులోకి రాలేదు. ఈ పనులకు సంబంధించి పర్యవేక్షణకు ఉద్దేశించి వేసిన కమిటీ మరి కొన్ని సౌకర్యాలతో పాటు చేసిన పనుల్లో చిన్న చిన్న మార్పులు సూచించినట్టు తెలుస్తోంది. ఈ సెంటర్ కోసం ప్రత్యేకంగా లిఫ్ట్ ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ టిజిఎంఐడిసి అధికారులకు ఆస్పత్రి నుంచి లిఫ్ట్ హ్యాండోవర్ చేయకపోవడంతో పాటు చిన్న చిన్న మార్పులకు సంబంధించి ఆలస్యమవుతున్నట్టు అర్థమవుతోంది. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని టిజిఎంఐడిసి, బోధనాస్పత్రి సిబ్బంది మధ్య సమన్వయంతో పనులు పూర్తి చేస్తే సెంటర్ రోజుల వ్యవధిలో అందుబాటులోకి వచ్చే అవకాశముందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ సెంటర్ అందుబాటులోకి వస్తే అవయవమార్పిడి శస్త్రచికిత్సల కోసం ఎదురు చూస్తున్న ఎంతో మంది పేద రోగులకు మేలు చేకూరుతుంది.